# అన్నదాత

ఆకాశం కల్లా ఎగజూసినాడు

మోడాలు దట్టంగా కమ్ముకోనుండాయి

పొద్దు కనపల్లా....

బోరుకల్లా చూసినాడు

లైటు మలగలా....

తోటకల్లా చూసినాడు

వాడు మొగం పెట్టిండాది....

తోటంతా పూతాపిందా...

ఆడాడ కొంచెం పెద్దగా ఉండే వంకాయలు...

పక్కన అరెకరా నేలలో

పచ్చగా ఉండే వరిపైరు కల్లా చూసినాడు...

నేలంతా పగుల్లు బారిండాది.

కరెంటు ఎప్పుడొస్తాదో... తోట ఎప్పుడు పారతాదో... నేను పోయాలకు ఆ ఐవేరు ఉంటాడో ఉండడో. పదకొండుకంతా వచ్చేయమన్నేడు.. అనుకున్నేడు నారాయణ.

"నారాయణన్నా... దిక్కులు చూస్తాండావేమి" అంటూ వచ్చినాడు కుమ్మరోళ్ల సిద్దయ్య.

"సేద్దిం చేసేవాళ్లం దిక్కులు చూడక ఏం చేస్తాం. కరెంటు దాంకోబూచి ఆడతాండాది. ఎప్పుడొస్తాదో ఎప్పుడు పోతాడో తెల్దు. తోటకు నీళ్లు కట్టి వారమయితాండాది. పూతాపిందెతో ఉండాది. నాల్నాల్లకు ఒగసారి తడితగలకపోతే పూత రాలిపోదా... మడి చూడు ఎట్లుండాదో. బొటనేల్లావు నెర్రెలిడిసిండాది." అన్నేడు నారాయణ యాష్టపోతా.

నారాయణ నిటారుగా నిలబడితే ఆరడుగులుంటాడు. చిన్నప్పట్నించి సేద్దిం చేసిచేసి వెన్నెముక వంగిపోయిండాది. ఆరడుగుల మనిషికూడా ఐదున్నరడుగుల మనిషిగానే కనబడతాండాడు. నెత్తిన జుట్టంతా సగంపైగా రాలిపోయిండాది. ఉన్న జుట్టుకూడా తెల్లబడిండాది. ఎండకు... వానకు... చలికి... పొలాల్లోనే గడపడం వల్లనేమో, తెల్లజుట్టుకూడా పుల్లరంగులోకి మారిపోయిండాది. తలకు చుట్టుకున్న పైగుడ్డ మాసిపోయిండాది. ఎముకలు

పొడుచుకొచ్చిన వంటిమీదున్న ఖద్దరు బనీను, పంచె చిరుగులు పడినాయి.

"బోర్లో నీళ్లు తగ్గినాయన్నా?"

"తగ్గినాయి. ఉండే వాటిని గుత్తంగా వాడుకొంటే సరిపోతాయి. ఈ కరెంటు సక్రమంగా వచ్చి సస్తే కదా. మా గొడవ మామూలుగా ఉండేదేలే. ఇంత పద్దన్నే యాడికి పోయి వస్తాండావు" అన్నేడు తోటంతా కలయ తిరుగుతా నారాయణ.

"మీ వూరికే పోయెస్తాండాన్నా"

"మా వూరికా... ఎవురింటికి సిద్దయ్యా"

"రంగారెడ్డెన్నోళ్లింటికి"

"వోనిదెగ్గిరికి ఎందుకు పోతివప్పా... పిల్లికి కూడా బిచ్చమెయ్యడే"

"నీళ్లతొట్లు తయారు చెయ్యాలన్నేడున్నా. చెప్పి రెండు నెల్లయితాండాది. సెంచికారం ఇస్తే చెయ్యచ్చని ఇప్పటికి మా వూర్నించి ఆరేడుసార్లు వచ్చినా. వచ్చినప్పుడంతా రేపొరం ఇస్తానురా అంటానే వుండాడు. సెంచికారం ఇస్తే నమ్మకం. పని మొదులు పెట్టేయచ్చు. ముందుగా చేసేస్తే అయ్యి ఎవ్వరూ తీసుకోకపోతే మాకు ఇబ్బంది కదా?" అన్నేడు బాధగా సిద్దయ్య.

"వాడు ముందు రంగారెడ్డికాదిప్పుడు. సేద్దిం చేస్తాన్నెప్పుడయితే ఎవరికన్నా ఆపదంటే వోనిదెగ్గిర ఉన్నే లేకపోయినా ఎట్లో ఒగట్లా సాయం చేస్తాండె. కాలనీ యిండ్లు కట్టించేది మొదులు పెట్టినాంక వోనంత పీనాసి నాకొడుకు ఇంగోడు ఉండడనుకో... అట్లమారిపాయ. వోన్ని నమ్ముకోని ఎందుకొస్తావులే. ఇద్దురు ముగ్గురు మేస్త్రీలు వోని దెగ్గిర ఉండారు. సిమెంటు తొట్లు కట్టించుకుంటాడుకానీ నీ దెగ్గిర మట్టియి ఎందుకు చేపించుకుంటాడు. పైసాపైసాకు గడ్డితినేటిగా ఐపోయినాడు. దానికోసరమే అయితే వోనిదెగ్గిరికి రాబనిలే" అన్నేడు నారాయణ.

సిద్దయ్య కొంచేపు మౌనంగా వుండిపోయినాడు.

"నిజమేన్నా... ఇంతకు ముందు ఎప్పుడన్నా నేనొస్తే కాఫీ తాగందే పంపించేవాళ్లు కాదు. అన్నం తినమని బలవంతం చేసేవాళ్లు. ఇప్పుడు మంచి నీళ్లు తాగతావా అని కూడా అడగలేదన్నా." అన్నాడు బాధగా.

"గూడులేని పేదోళ్లకోసం గవర్మెంటిచ్చే దుడ్డును దొబ్బేసేవోడు... వోడు దుడ్డు మొగం చూస్తాడుగానీ మనసల మొగం చూస్తాడా సిద్దయ్యా..." అన్నేడు తోటలో ఉండే కలుపు మొక్కను పెరికేదానికి ప్రయత్నిస్తా.

"ఔనులే... మీ పిల్లోల్లు ఎట్లుండారున్నా... చదవతానే ఉండారా?"

"పాపను చదువాపేస్తి. పదో తరగతిలో మండలానికే ఫస్టు వచ్చింది. కాలేజీకి అంపాలంటే పాసు తీసుకోవాల. నెలనెలా దుడ్డుండద్దా. అన్నే పెడదామంటే ఆడబిడ్డయిపాయ.

రూము తీసుకోవాల, అన్నం కూర చేసుకోవాల... వూరికే ఐతాదా? సేద్దింలో ఒగరూపాయి మిగిలించిందిలే. ఎనకటికి పెండ్లెట్లా చెయ్యాలకదా? అది తప్పుతుందా. చదువుకునిందంటే అంతకన్నా ఎక్కువ చదివిండే వోన్ని తేవద్దా. పెద్ద చదువులు చదివినోళ్లు కావాలంటే వూరికే ఐతాదా. ఎంతెంత కట్నాలివ్వాల. చదువాపేస్తే, ఆ చదువుకయ్యే దుడ్డు మిగిలించుకోని, దానికి ఇంకొంచెం జమ చేసినామంటే, ఉజ్జోగస్తుడు కాకపోయినా మాకు తగినోడయినా వస్తాడు కదా. అందుకని బిడ్డ చదువాపించేస్తి" అన్నేడు నారాయణ. ఆమాటలంటున్నపుడు అతని గొంతు జీరపోయింది.

"కొడుకునన్నా చదివిపిస్తాండావా లేదాన్నా?"

"చదివిపిస్తా వుండాప్పా. కూతుండ్లను చదివిపించి ఉజ్జోగాలు వచ్చినా పెండ్లయినాంక అత్తగారికే కదా పెడతారు. వోళ్లను చదివించకపోయినా బాధలే. కడంత్రం కాపెట్టుకోనుండి కట్టిని కడతేర్చేవాడు కొడుకే కదా. వోన్నిచదివీకుంటే ఎట్ల. తిరప్తిలో ఎమ్మెస్సీ చదవతాండాడు. ఈసారితో వోని చదువు అయిపోతాది. వోనికి ఉజ్జోగం వచ్చేసి, బిడ్డ పెండ్లి చేసేస్తే నాకేం బాదుండదు మల్ల." అంటానే పరిగెత్తినట్టుగా మోటారు కాడికి పోయినాడు. స్టాటర్‌కాడుండే బల్బు మలగతా ఉండాది. స్విచ్చు ఏసినాడు. మోటారు బుర్ర్ మనింది. ఎనకంటీనే పైపులోనించి నీళ్లు పన్నేయి. నీళ్లను చూడగానే నారాయణ మొగం నెల తర్వాత వానమొగం చూసిన శెనిగి చెట్లమాదిరిగా అయిపోయింది. పారను తీసుకోని నీళ్ల ఎనకంటీ పోతా "నీ బిడ్డలేం చేస్తాండారు సిద్దయ్యా?" అన్నేడు.

"ఏం చేస్తారన్నా. చదువబ్బలా వోళ్లకు. ఇద్దురూ కొడుకులే కదా. పెద్దోడు నా దెగ్గిరే ఉండి చేతిపని నేర్చుకుంటాండాడు. బొప్పులు, కుండలు బానలు తయారు చేస్తాండాడు. పెద్దపెద్ద వాడకాగులు, నీళ్ల తొట్లు చెయ్యాలంటే వోన్నింటి కాదు. చిన్నోడు పీలేరులో మెకానిక్కుపని నేర్చుకునేదానికి పోయినాడన్నా" అంటా మడి గెనంమింద కుచ్చొన్నేడు సిద్దయ్య.

వంకాయతోటకు నీళ్లుకడతానే "అదేమప్పా అట్ల చేసినావు. మీ కులవృత్తి నేర్పించ కూడదా" అన్నేడు నారాయణ.

"ఏం నారాయణన్నా.., ఎర్రి మాటలు మాట్లాడతా ఉండావు. కులవృత్తులు యాడుండాయన్నా. రైతులకు జరుగుబాటుంటే చేతిపనోళ్లం కూడా బతుక్కొంటాంటిమి. రైతులే పనుల్లేక పస్తులుంటాండారు. కొందురు దేశంమింద పలస్రం పోయిండారు. మిమ్మల్ను నమ్ముకోనుండే మమ్మల్ని, చేతిపని నమ్ముకోని ఎట్ల బతకమంటావన్నా?" ప్రశ్నించాడు సిద్దయ్య.

నారాయణ మాట్లాడకుండా ఉండిపోయినాడు. తోటకు నీళ్లు కడుతున్నాడు. కానీ అతన్ని సిద్దయ్య అడిగిన ప్రశ్న కుదురుగా ఉండనీలా. తిరిగి సిద్దయ్యే మాటలందుకున్నాడు.

"నీకు తెలీందేముందన్నా. మాదిగోళ్ల కాన్నించి, సాకలోల్లు, మంగలోల్లు, ఆచార్లు,

మేము... అందరం మీ రైతల నమ్ముకోనే బతకతాన్నింది. మాసువుల్లో పంట కళ్లంమింద రాశికుడితే మా ఇంట్లో ఉన్నెంత అనందంగా ఉండేది. మాకందరికీ మేరిస్తాంటిరి. రైతులంతా తలా కొన్ని యిచ్చేటియి కలుపుకుంటే సమచ్చరం పొడుక్కూ కూటికి ఇబ్బంది లేకుండా జరిగిపోతాండె. మద్దెలో తక్కవయినా ఏ రైతు ఇంటికాడికి పోయి ఇంట్లో బత్తెంలేవు సామీ, పదిశేర్లు ఈ అంటే ఈరు? ఇప్పుడు మీకేలే. మాకేమిస్తారు. మిమ్మల్ను నమ్ముకోనుండే మమ్మల్ను ఎట్ల చేతిపనులు నేర్చుకోమంటారు?" అని మళ్లీ ప్రశ్నించాడు.

తోటకు నీళ్లు కడుతూనే సిద్దయ్య మాటలకు ఔనన్నట్టు తల వూపినాడు నారాయణ.

"పద్దైదిరవై ఏండ్లయితాండాది పుంజుగా వానలు పడి. అప్పుడయితే నిరుటి వడ్లు ఈ సమచ్చరం తినేవాళ్లం. యిప్పుడు... కొనుక్కుంటాండాం. కాలం మారిపాయలే సిద్దయ్యా. ఆ కాలం ఇంగరాదు. మనమంటే ఏదో బతికేసినాం. ఇంగ మనబిడ్డలు ఎట్ల బతకతారో" యాష్టపోయినాడు నారాయణ.

బుర్రుమనే చప్పుడు ఆగిపోయింది.

"చూస్తివా కరెంటు పాయ. పది నిముషాల కొగసారి పోతాంటే, ఉండే అరాకొరా నీళ్లతో తోటలు ఎట్ల పారతాయి చెప్పు. నేల బాగా ఆరిపోయింటాదా. అయిన నీళ్లన్నీ కాలవకే చాలవు. మళ్లా కరెంటు వచ్చేలకు కాలవలో నీళ్లు ఇమిరి పోయింటాయి. మళ్లా రెడ్డొచ్చె మొదులెత్తు అన్నెట్టే కదా. ఇట్లయితే ఎన్ని నీళ్లయితే ఆటుకొంటాయి?" దిగులుగా అన్నేడు నారాయణ.

సిద్దయ్య మౌనంగా ఉండిపోయినాడు.

మోడాలు ఒగోటే మాయమైపోతాండాయి.

"ఎండ పెట్లకాస్తాండాదన్నా. నేను ఎలబారతా" అంటా లేచినాడు సిద్దయ్య.

"ఇందూరం వచ్చినావు. ఉత్త చేతలతో పోతాంటే బాధగా ఉండాదే. తోటలో కాయలు కూడా ఇంగా ముదరలా" అన్నేడు నారాయణ.

"సంతమొగం చూసి రెండు నెల్లయితాండాదిన్నా. ఊరిమిండి పచ్చిపులుసే. కాయగూరలు కొనేదానికి దుడ్డేదుందన్నా. అప్పు తెచ్చుకుందామన్నా ఇంతకుముందే చానా మంది రైతులకాడ అప్పు తీసకపోయినా. ఆ దుడ్డు ఇంగా ఈలా. వారం వారం సంతకు కుండలు ఎత్తుకోని పోతాండాది మా ఆడది. ఎవురు కొంటాండారున్నా. ఒగటి రెండు అమ్ముడుపోతాయేమో. వాటితో వచ్చే దుడ్డు బియ్యం, మిరపకాయలు, ఉప్పుకే చాలడంలేదన్నా. నేనయితే బొత్తిగా సంతకు పొయ్యేదే మానుకున్నేన్నా." అన్నేడు తోటలో పెద్దనయిన వంకాయల కళ్లా చూస్తా సిద్దయ్య.

"ఇంగా తొలికోత కొయ్యలా. మన్నాడు సోమారం కదా. రెండు మూడు

కేజీలుంటాయేమో. సంతకు కోసుకోని పోవాలంటా ఉన్నింది మీ ఒదిన" అంటానే తోటంతా కలతిరిగి ఏడెనిమిది వంకాయలు కోసి పై గుడ్డలో ఏసుకోనొచ్చి సిద్దయ్యకు యిచ్చినాడు నారాయణ.

నిక్కరు జోబీలోనించి గుడ్డ సంచిని తీసి దాంట్లో ఏసుకుంటా "అట్లే నాలుగు పచ్చి మిరపకాయలుకూడా ఈన్నా" అన్నేడు సిద్దయ్య కాలవ వారంటీ ఉండే మిరపచెట్లను చూస్తా.

నారాయణ పిడికిడు నిండుకు మిరపకాయలు కోసుకోనొచ్చి యిస్తా "యింగా మేము కూడా కూర చేసుకోలా. మా తోట కాయలు నువ్వే ఈసారి తొలీగా తింటాందేది" అన్నేడు.

"ఎవురికేది ప్రాప్తమోలేన్నా. వస్తా. ఎండ ఎక్కువయితాందాది" అని వాళ్ల వూరివైపు నడక మొదులు పెట్టినాడు సిద్దయ్య.

కొంచేపు సిద్దయ్య కల్లా చూసి 'ఎట్ల బతికినోడు... ఎట్లయిపోయినాడు' అనుకున్నేడు నారాయణ. స్టాటర్ దగ్గర ఉండే బల్బు మలగడంతో గబగబా వెళ్లి స్విచ్ వేసినాడు. పైపులోనించి నీళ్లు బొడబొడ మని చప్పుడు చేస్తా దుంకతాండాయి. పార తీసుకోని నీళ్ల ఎమ్మట నడస్తాండాడు.

"సద్ది తాగుదువురా నాయనో" అని కొడుకు అరిచేదాకా తోటకు నీళ్లు కట్టడంలో మునిగిపోయినాడు నారాయణ.

"నువ్వెప్పుడొచ్చినావురా?" అన్నేడు కొడుకును చూసి.

"నేను పద్దన్నే వచ్చినాలే. సద్ది తాగుపో. పొద్దు చూడు ఎంతెక్కిందో" అంటూ వచ్చి నారాయణ చేతిలోని పారను తీసుకున్నేడు భాస్కర్.

"నువ్వెందుకులేరా మల్లా. కరెంటు ఇంగ గంటలో పోతాది" అన్నేడు తలకు చుట్టుకోనుండే పైగుడ్డను తీసి ముఖం తుడుచుకుంటా.

"నేను కడతా ఉంటా కదా. నువ్వు తాగుపో"

పొద్దుకల్లా ఎగచూసినాడు నారాయణ. కణకణ మండే నిప్పుకణిక మాదిరిగా ఉండే పొద్దును చూశాలకు కళ్లు బైర్లు కమ్మినట్టుగా అనిపించింది. తల కిందికి దించి "నువ్వు తాగినావారా?" అంటా కాలవ వారంటీ తాలాడి కుంటగింజరాకులు కొన్ని పెరుక్కోని నోట్లో ఏసి కసాబిసా నమిలి చూపుడేలుతో తోమసాగినాడు.

"నేను సద్ది తాగినాలే. నీకెన్ని సార్లు నాయనా చెప్పేది ఏవేవో ఆకులతో, బొగ్గులతో పండ్లు తోమద్దని. పేస్ట్ వేసుకోని బ్రష్‌తో తోమాల. లేకుంటే వేపపుల్లో, కానగపుల్లో తీసుకోని తోమాల." అన్నేడు భాస్కర్ తండ్రిని మందలిస్తున్నట్టుగా.

నారాయణ వెర్రిగా నవ్వినాడు "అయ్యన్నీ ఉజ్జోగాలు చేస్తా, టౌన్లల్లో ఉండేవాళ్లకురా. సేద్దిం చేసుకుంటా రేయింబగళ్లు మట్టిలో పొల్లాడతా ఉండే నా బోటోళ్లకు ఎట్లయితాది? ఊరికేనే వచ్చే బొగ్గు, ఇట్లా ఆకులు పెట్టుకోని దుడ్డు పెట్టి ఏరైతన్నా అయ్యి కొంటాడంట్రా.

యాద మా నాయన అంత సంపాదించి పెట్టిండాడు మాకు. ఏపపుల్లతో తోమేంత సిరిగ్గాడానా?" అని, పైపు దగ్గరకు పోయినాడు నారాయణ. కాళ్లు చేతులు ముఖం కడుక్కోని పైగుడ్డతో తుడుసుకున్నేడు. పొలం గట్టునుండే కానిగి చెట్టుకిందికొచ్చి క్యారేజి విప్పినాడు.

రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు, ఉప్పు ఏసి కలిపి పంపిండాది లక్ష్మమ్మ.

క్యారేజీతోనే సద్ది కొంచెం తాగినాంక "నంజుకోను ఏం తేలేదంటరా" అన్నేడు నారాయణ.

"ఊరగాయలేమీ లేవంట నాయనా" అన్నేడు భాస్కర్.

క్యారేజిని పక్కన పెట్టేసి లేచి వంకాయతోటలో కాలవగడ్డల మీద వాడిపోతాన్నెట్టు ఉండే నాలుగు ఎర్రగడ్డ పేయలను లోడుకున్నేడు. వాటిని కాలవ నీళ్లల్లో కడుక్కుని తిరిగి వచ్చి క్యారేజీ వద్ద కుచ్చొన్నేడు.

తండ్రికళ్లా ఒగసారి చూసి మౌనంగా నీళ్లు కట్టసాగినాడు భాస్కర్.

ఎర్రగడ్డ నంజుకుంటా సద్దితాగుతా "కాలేజీ లేదా బాస్కరా" అన్నేడు నారాయణ.

"ఈరోజు ఉండాది. రేపు ఆదివారం కదా. అందుకని వచ్చినా. మర్నాడు కాలేజీలో ఫీజు కట్టాల."

ఫీజనేమాట వినగానే నారాయణకు పొరబోయింది. గబగబా పంపు దగ్గరికి వచ్చి నీళ్లు తాగి "ఎంత?" అన్నేడు.

"రెండువేలు" అన్నేడు మెల్లగా భాస్కర్.

నారాయణ మౌనంగా ఉండిపోయినాడు. తండ్రిబాధ అర్థమయిందేమో... భాస్కర్ మాట్లాడసాగాడు. "ఈ సేద్దిం చేయకపోతేనేం నాయనా"

"సేద్దిం చేయకుంటే ఇంగేం చేస్తాంరా?"

"ఎప్పుట్నించో సేద్దిం చేస్తాండావు కదా. ఇప్పుటికి గోచిపాతకు కూడా గతి లేకుండా బతకతాండామే. ఎందుకునాయనా ఈ సేద్దిం" అడిగినాడు కాస్త ఆవేశంగా భాస్కర్.

నారాయణ మౌనంగా కొడుకు కళ్లా చూసినాడు.

"మీరుకూడా స్ట్రైక్ చేయండి"

నారాయణకు వెంటనే అర్థం కాలేదా మాటలు.

"అదే నాయనా... బంద్ చేయండి" అన్నేడు భాస్కర్.

"మేమా... బందా...?" అన్నేడు ఆశ్చర్యంగా.

"ఔను... బందే... మాకు యూనివర్సిటీలో హాస్టల్లో నీళ్లు రాకపోతే వారం పదిరోజులు చూస్తాం. బంద్ చేస్తాం. ప్రొఫెసర్లు లేకపోతే బంద్ చేస్తాం. మా దగ్గర అంతంత ఫీజులు తీసుకుంటా, వోళ్లు అంతంత జీతాలు తీసుకుంటా సక్రమంగా చదువులు చెప్పకపోతే ఎందుకు గమ్మునుండాల?" తండ్రిని ప్రశ్నించాడు భాస్కర్.

"నువ్వాడికి పోయి చదువుకుంటాండావా... బందలు చేస్తాండావా?" అన్నేడు ఆందోళనగా నారాయణ.

"నీకన్నింటికి బళే భయం నాయనా. ఇట్లాంటియన్నీ మామూలే. స్టూడెంట్‌లే కాదు. ఉద్యోగస్తులంతా బంద్ చేస్తాండ్లా. కరువు భత్యం ఈలేదనో, జీతం పెంచలేదనో, రెగ్యులర్ చేయాలనో.... ఇట్లా ఎన్నోవాటికి బంద్ చేస్తారు కదా. ప్రజల సొమ్మును ప్రభుత్వం దగ్గరనుంచి జీతాల రూపంలో తీసుకుంటానే బంద్ చేస్తాండారు. అట్లాంటప్పుడు మీరెందుకు చెయ్యకూడదు?" అన్నేడు తీవ్ర స్వరంతో భాస్కర్.

నారాయణ కొడుకు కళ్లా భయంగా చూసినాడు.

"ఆర్‌టిసి వాళ్లు బంద్‌చేయలేదా? డాక్టర్లు చేయలేదా? బేంకులోల్లు చేయలేదా? కడాకు లారీ డ్రైవర్లు కూడా బంద్ చేస్తాండారు కదా. అట్లాంటప్పుడు మీరు బంద్ చేస్తే ఏం?" అన్నేడు నీళ్లు కడతానే.

"వాళ్లంటే ఉజ్జోగస్తులు. బంద్ చేసినా మళ్లయినా వాళ్ల జీతాలు వాళ్లకువస్తాయి. మాకట్ల కాదుకదా. రైతులు కరువుతో అప్పులయిపోయి చస్తాంటేనే సరిగా పట్టించుకోవడంలే గవర్మెంటు. బంద్ చేస్తే మాత్రం పట్టించుకుంటాదా? బంద్ చేసినా మాకే కదా నష్టం" అన్నేడు నిదానంగా నారాయణ.

"ఎందుకు నష్టం? ఇప్పుడు రేయింబగలు కష్టపడి పండించిన టమేటా అద్దరూపాయికి రూపాయికి బుట్ట అమ్మితే ఎంత లాభం వస్తాండాది. దానికన్నా అయ్యి పండించకుండానే ఉంటే ఖర్చులు, శ్రమ మిగలతాయి కదా. వడ్లుగానీ, శెనిగిగానీ... ఏపంటన్నా తీసుకో... ఇప్పుడు బావులు లేవుకదా..., బోరేసేకాన్నించి... దున్నడం... నాట్లేయడం.... మందులు చల్లడం.... కలుపు తీయడం... కూలీలు... కరెంటు కర్చు... మీకష్టం.... ఎంతయితాండాది నాయనా. మీకొచ్చేది ఎంతుండాది? నువ్వెప్పుడన్నా ఆలోచించినావా? పెట్టుబడి కూడా రాని ఈ సేద్దిం చేయకుంటేనేం?" అన్నేడు ఆవేశంగా భాస్కర్.

కొడుకు ఆవేశం చూస్తే భయం వేసింది నారాయణకు. వీడేమయిపోతాడో ఏమో అనుకున్నేడు. "అది కాదురా... రైతు పుట్టక పుట్టినాంక సేద్దిం చేయకుండా ఎట్లుంటామురా" అన్నేడు.

"తాతలకాలం మాటలు వద్దు నాయనా. మన దేశంలో డెబ్బైశాతం మంది వ్యవసాయం చేసేవాళ్లే ఉండారు. మిగిలినోళ్లంతా వీళ్లమిందే ఆధారపడి ఉండారు. మీరు తినీ తినకా పండించి అవస్థలు పడతాంటే మిగిలినోళ్లు మాత్రం మూడుపూటలా లక్షణంగా ఉండారు. వాళ్లంతా డబ్బే తిననీ. మీరు మాత్రం పండించింది దేన్నీ అమ్మద్దండి. ఉప్పు తప్పించి అన్నీ మీరు పండించేటియే కదా. మాకు చదువులు వద్దు... ఉద్యోగాలు వద్దు.... పండింది తిని

ఉందాం. ఐదారేండ్లు ఏమీ అమ్మద్దండి. అప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దాం." అన్నేడు ఆవేశంగానే భాస్కర్.

"చదువుకోకపోతే ఎట్లరా? నా మాదిరిగానే సేద్దం చేస్తావా నువ్వు"

"మేము చదివేది కూడా ఒక చదువేనా. ఉద్యోగస్తులు, యాపారస్తులంతా పిల్లోల్లను వేలు, లక్షలు కుమ్మరించి చదివిపిస్తా ఉండారు. వాళ్లతో పోటీపడి మేము ఉద్యోగాలు తెచ్చుకోగలమా. బస్సులమింద బోర్డులు చదవడానికి తప్పించి ఎందుకూ పనికిరావు మా చదువులు. నా మాటిని రైతులంతా మాట్లాడుకోని ఐదారేండ్లు పండించినోటియి ఏవీ అమ్మద్దండి. అప్పుడు తెలుస్తుంది మీ శక్తి, అవసరం ఏందో."

"వానలు సక్రమంగా కురిస్తే ఒగరు మనకు సాయం చేసేదేందిరా. మనమే ఒగరికి సాయం చేస్తాం. వానలు సక్రమంగా పడకపోతే ఎవురుమాత్రం ఏంచేస్తార్లే. నువ్వు దీనిగురించి ఏమీ ఆలోచించకుండా బాగా చదువుకో" అన్నేడు కొడుకును అనునయిస్తున్నట్టుగా.

"ఇట్లా మాటలే వద్దనేది. ఇప్పటికే ఎంతోమందికి ఎన్నోసార్లు చెప్పినా. నామాట ఒక్కరూ వినరే. రైతులకు కూడా ప్రభుత్వం వానతో సంబంధం లేకుండా పనిచేసినన్ని దినాలకు జీతం ఇచ్చేయాల. ప్రభుత్వమే గిట్టుబాటుధర కల్పించి కొనుగోలు చేయాల. వాళ్లకిచ్చిన జీతం, పెట్టుబడులు అన్నీ పోను మిగిలిన డబ్బును ఆయా రైతులకే యిచ్చేయాల. నష్టం వస్తే దాన్ని ప్రభుత్వమే భరించాల. ఒకవేల వాన రాకుండా పంటే పెట్టకపోతే నెలజీతంలో సగం చెల్లించాల. ఒక్కసారి ఒకపంటలో నష్టం వస్తే ఇంకో పంటలో ప్రభుత్వం దాన్ని రికవరీ చేసుకోకూడదు. అట్ల చట్టం వస్తేకానీ రైతులు బాగుపడరు. అట్ల ప్రభుత్వం చేయకపోతే మీరు పంట పెట్టింది ఎవురికే కానీ అమ్మద్దండి." అన్నేడు భాస్కర్ తండ్రికి కర్తవ్యబోధ చేసే కృష్ణుడిలా.

కొడుకు మాటలు వింటుంటే నారాయణ మనసు ఏదో తెలీని తెంపరి తనము, దిగులుతో కలగాపులగంగా మారిపోయింది.

"పంట అమ్మకపోతే అప్పులెట్లరా" అన్నేడు కొడుకు ముఖంలోకి చూస్తా.

కరెంటు మళ్లీ పోవడంతో వచ్చి తండ్రికి ఎదురుగా కూర్చున్నేడు భాస్కర్.

"ఏమవుతుంది? అప్పులు ఐదేండ్లు కట్టద్దండి. కట్టమని ఖరాకండిగా చెప్పండి. కాదు నాయనా... అప్పులతో ప్రాణాలే తీసుకుంటాండారు కదా. ప్రాణం కన్నా విలువైంది ఏదీలేదు. మానం కన్నా ప్రాణం ముఖ్యమనుకోండి. ప్రాణముంటేనే కదా...., అప్పులయినా అవమానాలయినా. నేను చెప్పినట్టు చెయ్యండి. రైతులు బాగుపడకపోతే నేను నీకు పుట్టినోన్నేకాదు" అన్నేడు మళ్లా ఆవేశంగా భాస్కర్.

నారాయణలో మళ్లీ కొడుకు పట్ల భయం పట్టుకునింది. వీడు కాలేజీకి పోయి చదువుకుంటా ఉండాడో ఇంకేం చేస్తా ఉండాడో అనే అనుమానం వచ్చింది.

"రేయ్... పిల్లోడివి. నీకేం తెలీదుగానీ బుద్ధిగా చదువుకో. నాతో చెప్తే చెప్పినావుగానీ, ఇంగెవరితో ఇట్లా మాటలు మాట్లాడద్దు. ఎవురో ఏదో సాయం చేయలేదని రైతులు పంటలు పెట్టేది ఎట్ల మానుకుంటార్రా. పంటలు పెట్టినాంక లోకమంతా పస్తుంటే చూస్తా ఎట్లుంటాం? రైతుపుట్టక పుట్టినాంక ఒగరు సాయం చేసినా చేయకపోయినా సేద్దిం చేయాల్సిందే. పండినా పండకపోయినా అన్నమేళకు ఇంటికొచ్చినోళ్లకు అన్నం పెట్టి పంపాల్సిందేలే. నువ్వన్నీ ఏమీ ఆలోచించద్దు. కరెంటొచ్చిండాది చూడు. నీళ్లు కట్టు. నేను పీలేరుదాకా పోయొస్తా. పనుండాది" అంటా లేచినాడు నారాయణ.

"రైతులంతా మొరటోళ్లు. మంచిమాటలు ఏ పొద్దు ఇన్నేరు." అంటాండే కొడుకు మాటలను పట్టించుకోకుండా ఇంటిదారి పట్టినాడు నారాయణ.

పెరుగుతున్న అప్పులు...

వాన పడకపోవడం....

పెండ్లికెదిగిన కూతురు...

ఏదేదో మాట్లాడుతున్న కొడుకు...

నారాయణను స్థిమితంగా ఉండనివ్వలేదు. పీలేరుకు పోయి ఐవేరు దెగ్గిర దుడ్డు తీసకచ్చి అప్పులోల్లకన్నా ముందుగా ఈనికి ఫీజు కట్టాల. లేకుంటే ఏమయిపోతాడో ఈడు అనుకున్నేడు. పొద్దుకల్లా మళ్లా ఒకసారి చూసినాడు. పదిగంటలు అయ్యింటాదేమో అనుకున్నేడు. పదకొండు గంటలకు పీలేరుకు రమ్మన్నేడు. బస్సుదారికి పోయాలకు పన్నెండయితాదేమో అనుకుంటా గబగబా నడుస్తా ఇల్లు చేరుకున్నేడు. చకచకా స్నానం చేసి బట్టలు మార్చుకుని, భార్య దగ్గర ఇరవై రూపాయలు తీసుకొని రోడ్డు మీదకు పోయినాడు. అరగంటకు వచ్చిన బస్సెక్కి పీలేరుకు చేరేప్పటికి పన్నెండయింది. బస్టాండుకాన్నించి చకచకా నడస్తాండాడు.

ఐవేరు ఇంటికాన్నే ఉంటాడా...

పదివేలు ఇస్తాడా...

పదివేలు ఇస్తే... కొడుక్కు రెండువేలు ఇయ్యాల.

ఎరువులంగట్లో ఐదువేలియ్యాల.

నాగిరెడ్డి కూతురికి పెండ్లి పెట్టుకోనుండాడు. వాళ్లకివ్వాల్సిన మూడువేలు ఇచ్చేయాల.

ఇంట్లో బియ్యం ఐపోయిండాయి... వోటికి మళ్లా అప్పు చెయ్యాల్సిందే.

ఈ పొద్దు అన్నం వండిందో లేదో... రాత్రే బియ్యం అయిపోయినాయంటాన్నింది....

హమ్మయ్య... ఐవేరు ఇంటికాడికి వచ్చేసినా.... అనుకున్నేడు నారాయణ.

అజంతా టాకీసు పక్క సందులో కుడివైపున నాలుగో ఇంటిముందు నిలబన్నేడు.

'బి. రామనాథశర్మ, రెవెన్యూ ఉద్యోగి' అనే బోర్డు ఇంటిముందున్న గోడకు వేలాడతా ఉండాది. అదొక రెండంతస్తుల మిద్దె. చెప్పులు గేటు వద్దే వదిలి లోపలికి పోయి తలుపును తట్టినాడు. రెండు నిముషాల్లో ఒకావిడ వచ్చి తలుపు తీసి ఎవరు కావాల అన్నెట్టు చూసింది.

"మాది కమ్మారపల్లెమ్మా... ఐవేరు లేడా" అన్నేడు నారాయణ.

ముఖం చిట్లించుకుంటా "లేరు" అంటా తలుపు వేసేయబోయింది.

"అమా అమా..." అన్నేడు నారాయణ తలుపు మూసేస్తుందేమోనని.

"ఐవేరు నన్ను పదకొండు గంటలకు రమ్మన్నేడుమా... తోటకు నీళ్లు కట్టేసి వచ్చేలకు ఈయరవయింది.

"ఆయన పద్దన్నే బయలుదేరి చిత్తూరెళ్లినారు. భోజనానికి వచ్చేస్తారు ఏంపని" అందామె తలుపు తీసి కాస్త దగ్గరగా వచ్చి.

"పదివేలు దుడ్డు అక్కరొచ్చిందమ్మా. ఇస్తానన్నేడు. అందుకని వచ్చినా." అన్నేడు నసుగుతా.

"సరేలే. ఆయనొస్తే మాట్లాడుకో" అంటా ధనామని తలుపేసుకునేసింది ఆయమ.

మూతపడిన తలుపుకళ్లా కొంచేపు చూసినాడు. ఎండనపడి నడుచుకుంటా రావడంతో బాగా దాహంగా ఉంది నారాయణకు. వీధిలోకి వచ్చి నిలబన్నేడు. బస్టాండు దగ్గరుండే తమ వూరి సహదేవనాయుడు హోటల్ గుర్తుకొచ్చింది. ఉసురోమంటా నడుచుకుంటా అక్కడికి పోయినాడు. పద్దన్నే తాగిన సద్ది ఎప్పుడో అరిగిపోయిండాది.

సహదేవనాయుడు గల్లాపెట్టి దెగ్గిర కుచ్చోనుండాడు. నారాయణను చూస్తానే "ఏం నారాయణా... బాగుండావా... ఈ మధ్య కనిపించేదే లేదే" అన్నేడు నవ్వతా.

"బాగుండాం... మీరు బాగుండారా... టౌనుకు ఊరికే ఎందుకొస్తాం. పనిబడితేనే కదా" అంటా పోయి టేబుల్ మీదుండే జగ్గు తీసుకోని నిలపకుండా నీళ్లు తాగేసి వచ్చి సహదేవనాయుడుకు ఎదురుగా ఉండే స్టూలు మీద కుచ్చొన్నేడు.

భోజనం సమయం కావడంతో హోటల్ బాగా రద్దీగా ఉండాది. బిల్లులు తీసుకుంటా, ఎవరేం తింటాండారనేది గమనిస్తానే అప్పుడప్పుడు నారాయణతో మాట్లాడతాండాడు సహదేవనాయుడు.

అన్యమనస్కంగా సమాధానాలు చెప్తాన్నె నారాయణ ధ్యాసంతా అన్నంమిందే ఉంది. తమ వూరివాడు కదా. తను కూడా ఎప్పుడూ రాడు. ఏదన్నా పనిబడి వచ్చినా ఇట్లొచ్చి అట్లెళ్లి పోతాడు. రాకరాక వచ్చినానని అన్నం తినమంటాడేమో, తిందాం అని ఆశగా కాసుకోనుండాడు. పద్దన్నే తాగిన సద్ది అరిగిపోయిందానికి తోడు, హోటల్లోని మసాలా కూరల వాసన ఆకలిని ఇంకా ఎక్కువ చేస్తాండాది. గంటసేపు కుచ్చొన్నేడు. ఏవేవో మాటలంతా

మాట్లాడతాండాడే కానీ అన్నం మాత్రం తినమని చెప్పలేదు.

"జనం ఎక్కువగా ఉన్నెట్టుండారు. నేను మళ్లా వస్తా" అని తిరిగి ఐవేరు ఇంటి దగ్గరకు పోయినాడు. వేసిన తలుపు వేసినట్టే ఉంది. బయట స్టాండులో చెప్పులులేవు. ఇంకా రాలేదనుకున్నాడు. తిరిగి కాళ్లీడ్చుకుంటా హోటలు కాడికి వచ్చినాడు. మళ్లా జగ్గు నీళ్లు తాగేసి సహదేవనాయుడు ఎదురుగా స్టూలు మీదే కుచ్చొన్నేడు. లోపల టేబుల్‌లు ఫుల్ అయితాండాయి. ఖాళీ అయితాండాయి. వాళ్లు తినేసి లేస్తానే తినమంటాడేమో... ఈళ్లు తినేసి లేస్తానే తినమంటాడేమో... అని ఆశగా ఎదురు చూస్తానే ఉండాడు నారాయణ. గంటసేపు కుచ్చొన్నే అన్నం తినమనే మాటమాత్రం చెప్పలేదు సహదేవనాయుడు.

ఐవేరు వచ్చింటాడేమోనని మళ్లా బయలుదేరినాడు.

"ఏం నారాయణా పోతాండావు. మళ్లా వస్తావా?" అన్నేడు సహదేవనాయుడు.

"వస్తేవస్తా లేదంటేలేదు. ఏమి?"

"ఏంలే... వూరికే అడిగినా. మా మామ వచ్చి రెండునెల్లయితాండాది. వూరికి పోతానే ఒగసారి రమ్మని చెప్పు" అన్నేడు.

సరేనని అక్కడినుంచి బయలుదేరి ఐవేరు ఇల్లు చేరుకున్నేడు.

తలుపు మూసే ఉంది.

ఐవేరు వచ్చినాడేమో. లోపలుండాడేమో... అనే ఆశ.

తలుపును తట్టినాడు. ఐదు నిముషాలు చూసినాడు. తెరుచుకోలేదు. మళ్లా తట్టినాడు. ఐదు నిముషాలు చూసినాడు. తెరుచుకోలేదు. మళ్లా తట్టినాడు. వెంటనే తలుపు తెరుచుకునింది.

"ఏమయ్యా... కనీసం అన్నం కూడా తిననిచ్చేట్టు లేవే. ఆయనింకా రాలేదు." అని విసురుగా ఆయమ తలుపేసుకునేసింది.

నారాయణకు చాలా బాధేసింది...

అక్కడినుంచి వెళ్లిపోవాలనుకున్నాడు...

కొడుకు ఆవేశం, వాడి చదువుకు కట్టాల్సిన ఫీజు గుర్తుకు వచ్చింది..

ఎరువులంగడి...

నాగిరెడ్డి కూతురు పెండ్లి గుర్తుకు వచ్చింది...

ఎంతసేపయినా సరే ఉండి, ఐవేరు వచ్చినాంక దుడ్డు తీసుకోని పోవాలనుకున్నేడు. ఐవేరమ్మతో నాకేం పనిలే. ఆయమ్మంటే నెల్లూరామె. నాకు కొత్త. ఐవేరు మా వూరోడే కదా. ఆయన మతిస్తే చాల్లే అనుకుని కొబ్బరి చెట్టునీడ కొంచెం రోడ్డుమీద పడతాంటే ఆడ కుచ్చొన్నేడు.

కడుపులో నీరసం. ఎదలో భవిష్యత్తు మీద భయం.

రకరకాల ఆలోచనలు నారాయణను చుట్టుముడతాండాయి.

'ఐవేరు దుడ్డు ఇస్తాడా...?

ఎందుకీడు... తప్పకుండా ఇస్తాడు.

ఐవేరికి ఉజ్జోగం వచ్చేదానికి ఆకాలంలో నాయన మాటసాయం, దుడ్డు సాయం చేసినాడు కదా. ఆ దుడ్డు మళ్లా యిచ్చేసినాడు. నాయన అబ్బుడు సాయం చేయకుండా ఉన్నింటే కొడుక్కు ఉజ్జోగం వచ్చిండదని ఐవేరి నాయన ఎన్నోసార్లు చెప్పినాడు. ఇప్పుడు వోళ్లనాయన లేడు. అయినా ఐవేరు ఏదీ మరిసిపోలా. అందుకే అడక్కడక్క పదివేలు అడిగితే ఇంగేం మాట్లాడకుండా ఇస్తానన్నేడు. ఈ పొద్దు పదకొండు గంటలకు రమ్మన్నేడు. ఐవేరు వస్తానే దుడ్డు తీసుకోని ఎల్లిపోవాల' అనుకున్నేడు.

ఎంత సేపు కుచ్చొన్నేడో ఏమో.... ఎప్పటికో ఐవేరు వచ్చినాడు. ఐవేరిని చూస్తానే "నమస్తే సోమీ" అన్నేడు నారాయణ లేచి.

"ఆc.... ఎంత సేపయిందన్నా వచ్చి" అన్నేడు ఇంట్లోకి పోతా.

"చానా సేపే అయింది సోమీ" అన్నేడు నారాయణకూడా ఎనకంటీ పోతా.

"సరే... కొంచేపు కుచ్చోనుండు. ఇంగా భోంచేయలా. భోంచేసి వస్తా" అని లోపలికి పోయినాడు.

నారాయణకు ఆకలితో కడుపు నొప్పిగా ఉండాది. 'ఐవేరు దుడ్డు ఇస్తానే తీసుకోని సహదేవనాయుడుగాడి హోటల్లో దుడ్డు ఇచ్చి బిర్యాని తినాల' అనుకున్నేడు.

అరగంట కుచ్చొన్నేక తాంబూలం నములుతా వచ్చి వరండాలో కుర్చీ వేసుకుని కుచ్చొన్నేడు ఐవేరు. నారాయణ ఆయనకు ఎదురుగా చేతులు నలుపుకుంటా నిలబడుకున్నేడు.

"ఏం నారాయణన్నా... నీ ఇబ్బంది"

నిన్నంతా చెప్పినా. ఇప్పుడు మళ్లా రెడ్డొచ్చె మొదులెత్తు అన్నెట్టుండాదే అనుకుంటానే మళ్లా దుడ్డు ఎందుకు అవసరమో మొత్తం చెప్పినాడు.

"ఇప్పుడు అప్పు ఎంతుండాది?"

"సొసైటీ బేంకులో, ఇండియన్ బేంకులో కలిపి లక్షా ముప్పై వేలుండాది. అదిగాక బయట లక్షరూపాయలుండాది" అన్నేడు నారాయణ.

"అంతప్పు ఎందుకుండాది."

"సేద్దింకదా సోమీ. వానలు సక్రమంగా పల్లా. దాంతో బాగా నష్ట పోయినాం. పండినోటికి రేటుకూడాలేదు."

"వానపన్నంత మాత్రాన అప్పులు ఎందుకయితాయి. కరెంటు ఫ్రీగా వస్తాండాది. సబ్సిడీకి ఎరువులు, యిత్తనాలు యిస్తాండారు. బోర్లేసుకునే దానికి లోన్లు యిస్తాండారు. వోటిల్లో కూడా సబ్సిడీలు. మీరంతా గవర్నమెంటు దగ్గరనుంచి తీసుకునేదేగాని యిచ్చేదేంలేదు

గదా. ఎందుకంత అప్పులు ఐనాయి?" అన్నేడు ఐవేరు.

నారాయణకు ఏం చెప్పాలో తెలీలేదు

తనకు కనీసం బీడీ తాగే అలవాటు కూడాలేదు

ఇంట్లో, భార్య వంటిమింద వీసెమెత్తు బంగారం కూడాలేదు

కొడుకును కూడా మంచి చదువులు చదివిపించలేకపోయినాడు

కూతుర్ని ఏకంగా చదువే ఆపించేసినాడు

అప్పులయినాడు

ఇదంతా వ్యవసాయాన్ని నమ్ముకునే కదా

పదిమట్ల లోతు బాయిలో కూడా నీళ్లు లేవే

పది బోర్లేసినా నీళ్లు పల్లేదే

ప్రతి సంవత్సరం ఎంతెంత పెట్టుబడి పెడతాండాడు

నీళ్లులేక, వానపడక ఎంతెంత నష్టం వస్తాండాది

అయ్యన్నీ, ఐవేరికి తెలీవా. తెలిసే అడగతాండాడా...?

"ఏం గమ్మునయిపోతివే... సరేలే... నీ కష్టాలు నీకుంటాయి. ఈసారి జిలకర మసూర ఎవరన్నా ఏసిండారా మనూర్లో" అనడిగినాడు ఐవేరు.

ఆలోచనల్లోనించి తెప్పరిల్లి "ఎవురూ ఏయలేదు సోమీ. వానలు ఎనిక్కి దీసేలకు మూన్నెళ్లలో పండేటియే ఏస్తాండారంతా" అన్నేడు నారాయణ.

"మేము బయట షాపుల్లో కొంటాండాంకానీ, అయ్యంత బాగుండటంలేదు. రేటు కూడా ఎక్కువే. చుట్టుపక్కలా ఎవరిదగ్గరన్నా ఉంటే నాకు చెప్పు. కొనుక్కుంటాం"

"సరే సోమీ... నాకు దుడ్డు...'

"లక్షల్లో అప్పుండేవోనివి ఎట్ల తీరస్తావు బాకీ" అన్నేడు ఐవేరు.

'కుంటనేలకూడా లేని మీకు ఏం చూసి అప్పట్లో మా నాయన దుడ్డు ఇచ్చినాడు' అని అడగాలనుకున్నేడు. కానీ అడగలేకపోయినాడు.

నారాయణ సమాధానం కోసం ఎదురు చూడకుండా "నా దగ్గర లేదన్నా. మీ నాయన నా ఉద్యోగానికి సాయం చేసినాడు. అందుకని నీకు ఆపదలో ఆదుకోవాలనుకున్నా. కానీ అనుకున్న తావన డబ్బు చేతికి రాలా. ఇంగ ఇప్పట్లో ఈలేంనా. కాలేజీ పక్కన జాగా ఈ రోజే సెటిల్ అయింది. దానికి నాకే డబ్బవసరం." అన్నేడు ఐవేరు.

నారాయణకు నోట మాట రాలేదు. కొంచేపు మౌనంగా కుచ్చొన్నేడు. ఐవేరితో ఇంకేం మాట్లాడ బుద్ధికాలేదు. పోయొస్తానని కూడా చెప్పకుండా తిరుగు ప్రయాణమయినాడు. బస్టాండుకు వచ్చేటప్పటికి బస్సు రెడీగా ఉన్నింది. ఎక్కి ఇల్లు చేరేలకు సాయంకాలం

నాలుగయింది. ఆకలితో శోష వచ్చి పడిపోతానేమో అనుకున్నేడు నారాయణ. ఇంటి కాడ కమ్మపల్లెనుంచి వచ్చిన సాకలోళ్ల క్రిష్ణ కుచ్చోనుండాడు.

"బాగుండారా నారాయణన్నా" అన్నేడు క్రిష్ణ.

"బాగుండాం క్రిష్ణా. ఎంచేపయింది వచ్చి" అన్నేడు.

"మద్దేనమే వచ్చినాన్నా. నిన్నొగసారి చూసేసి పోదామని కుచ్చోనుండా"

"అన్నం తిన్నేవా"

"లేదన్నా... ఇంటికాడ పద్దన తాగిన సద్దే"

"ఉండు వస్తా" అనేసి లోపలికి పోయి పెరట్లో కాళ్లూ చేతులూ కదుక్కున్నేడు. భార్య చెంబుతో నీళ్లు తెచ్చిచ్చింది నారాయణకు.

చెంబును చేతిలోకి తీసుకుని "క్రిష్ణకు అన్నం పెట్టినావా" అనడిగినాడు.

"లేదు... నీకు సరిపోయేంత అన్నమే ఉండాది. రాత్రే బియ్యం లేవన్నే కదా. నువ్వు నామాట పట్టించుకోలా. ఉన్నోటియి ఏసి చేసినా. ఇంగ ఒగటిన్నర పావుండాయంతే. రాత్రికి కావద్దా" అనిందామె.

"అన్నమేలకు ఇంటిముందుకొస్తే ఎప్పుడన్నా చేతిపనోళ్లకు అన్నం పెట్టకుండా పంపతాండామా. పొయ్యిమింద బియ్యం పెట్టి, ఉండే అన్నం వోనికి పెట్టుపో" అని చెంబు నీళ్లు గటగటా తాగసాగినాడు నారాయణ.

నీళ్లు తాగుతున్న భర్తనే కొంచేపు చూసి వంటగదిలోకి పోయిందామె.

*నవ్య వీక్లి, 29 డిసెంబర్ 2004*

*కథ 2004*

*కథా వార్షిక 2004*